అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

సంపుటి - 2 సంచిక -116 బుధవారం 16 జులై 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts




2లో.

## గవర్నర్ వద్దకు బీసీ రిజర్వేషన్ల ముసాయిదా


WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103


# ముగిసిన శుభాంశు రోదసీయాత్ర

### క్షేమంగా భూమ్మీదకు చేరుకున్న భారత వ్యోమగామి
### ప్రధాని మోడీ తదితరుల శుభాకాంక్షలు



కాలిఫోర్నియా**జులై15(జర్నలిస్ట్ వార్త)** భారత వ్యోమగామి శుభాంశు శుక్లా రోదసీయాత్ర ముసిగింది. ఆయన తిరగి క్షేమంగా భూమ్మీదకు చేరుకున్నారు. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతరిక్ష పరిశోధన కేంద్రం ఐఎస్ఎస్‌కి వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా తిరిగి భూమిపైకి చేరుకున్నారు. అంతరిక్షంలో ఆయన 18 రోజులు గడిపారు.

# భారత్‌లో టెస్లా

### ముంబైలో తొలి షోరూమ్ ప్రారంభం -ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం ఫడ్నవీస్



# జీనోమ్ వ్యాలీలోని పరిశ్రమలు తెలంగాణకు గుర్తింపు

### దేశంలోని వ్యాక్సిన్లలో 33 శాతం జీనోమ్ వ్యాలీ నుంచే ఉత్పత్తి చేస్తున్నామని వెల్లడి
### ఇక్కడి వ్యాక్సిన్లను ప్రపంచ దేశాలకు సరఫరా చేశామన్న రేవంత్ రెడ్డి



హైదరాబాద్,**జులై15(జర్నలిస్ట్ వార్త)**
ప్రపంచ బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్ రూపుదిద్దుకుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జీనోమ్ వ్యాలీలోని పరిశ్రమలు తెలంగాణకే గుర్తింపును తీసుకొచ్చాయి. దేశంలోని వ్యాక్సిన్ల ఉత్పత్తిలో 33 శాతం కేవలం జీనోమ్ వ్యాలీ నుంచే ఉత్పత్తి చేస్తున్నాం. ప్రపంచాన్ని కోవిడ్ భయపెడుతున్న సమయంలో ఇక్కడి నుంచే వ్యాక్సిన్లు తయారు చేశాం. మిగతాది 2లో...

# బనకచర్లపై చర్చ అవసరం లేదు

## కేంద్రానికి తెలంగాణ కీలక లేఖ

### ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రుల సమావేశం..
### బనకచర్ల అజెండాపై తెలంగాణ అభ్యంతరం
### పెండింగ్ ప్రాజెక్టులు సహా వివిధ అంశాలను అజెండాగా పంపిన తెలంగాణ
### బనకచర్లకు ఎలాంటి అనుమతులు లేవన్న తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్,**జులై15(జర్నలిస్ట్ వార్త)** గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. ఈ అంశంపై చర్చించేందుకు కేంద్ర జలశక్తి శాఖ నుండి రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు పిలుపు వచ్చింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన జరిగే సమావేశంలో బనకచర్లపై చర్చ అవసరం లేదని తెలంగాణ ప్రభుత్వం ఆ లేఖలో స్పష్టం చేసింది.కృష్ణా నదిపై పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులను అజెండాగా ప్రతిపాదించింది. పాలమూరు, దిండి ప్రాజెక్టులకు జాతీయ హోదా, ఇచ్చంపల్లి ప్రాజెక్టును కేంద్రం చేపట్టాలని, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టుకు 80 టీఎంసీలు కేటాయించాలని అజెండాగా పంపించింది. ఏపీ ఇచ్చిన బనకచర్ల అజెండాపై తెలంగాణ అభ్యంతరం తెలిపింది.బనకచర్లకు ఎలాంటి అనుమతులు లేవని, చట్టాలు, ట్రైబ్యునల్ తీర్పుల ఉల్లంఘన జరుగుతోందని ఆ లేఖలో ప్రస్తావించింది 2లో...



# ఇరిగేషన్ మాజీ ఈఎన్‌సీ అరెస్ట్

### మురళీధర్‌రావు అక్రమాస్తులు రూ.కోట్లలోనే
### ఆయన ఆస్తులపై ఏసీబీ మెరుపుదాడులు
### హైదరాబాద్‌తో పాటు కరీంనగర్‌లో సోదాలు



# కాల్పుల కలకలం

### సీపీఐ రాష్ట నాయకుడు చందునాయక్ మృతి
### కండ్లలో కారం చల్లి ఫైరింగ్
### ఆధారాలు సేకంచిన క్లూస్ టీమ్స్,
### ఐదు రౌండ్ల బుల్లెట్లు స్వాధీనం
### నిందితుల కోసం 10 బృందాలతో గాలింపు
### మలక్‌పేట శాలివాహననగర్ పార్కులో ఘటన



మలక్‌పేట్**జులై15(జర్నలిస్ట్ వార్త)**
హైదరాబాద్ నగర నడిబొడ్డున కాల్పులు కలకలం రేపాయి. మలక్‌పేట్ శాలివాహననగర్ పార్క్‌లో ఉదయం వాకింగ్‌కు వెళ్లిన సీపీఐ రాష్ట్ర నాయకులు చందు నాయక్(43)పై అందరూ చూస్తుండగానే సినిమా తరహాలో దుండగులు తుపాకులతో కాల్చి దారుణంగా హత్య చేశారు. ఏం జరిగిందో అర్థమయ్యేలోపే కారులో వచ్చిన వారు ఆరు రౌండ్లు కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనలో చందునాయక్ అక్కడికక్కడే మృతిచెందారు. దీంతో పార్కులో ఉన్నవారు, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మిగతాది 2లో...

# మల్లు భట్టివిక్రమార్కకు బీజేపీ అధ్యక్షుడు లీగల్ నోటీసులు

### రోహిత్ వేముల ఆత్మహత్య అంశంపై రామచందర్ రావుపై ఆరోపణలు
### తనకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీజేపీ అధ్యక్షుడి డిమాండ్
### లేదంటే రూ. 25 కోట్లకు పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరిక



# విద్యార్థుల మరణాలకు రేవంత్ బాధ్యత వహించాలి: కేటీఆర్

### ఫుడ్ పాయిజనింగ్ కారణంగా వందకు పైగా విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారన్న కేటీఆర్
### రేవంత్ ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదని విమర్శ



2లో

# అమిత్ షాతో భేటీ

### ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసిన ఏపీ సీఎం చంద్రబాబు
### ఏపీకి మరింత ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి

ఢిల్లీ:**జులై15(జర్నలిస్ట్ వార్త)** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి మరింత ఆర్థిక సహాయం అందించాలని చంద్రబాబు కేంద్రాన్ని కోరారు. రాష్ట్రం ఇంకా తీవ్ర ఆర్థిక వనరుల కొరతను ఎదుర్కొంటున్నందున, ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిన పెట్టడానికి కేంద్రం సహాయం అవసరమని ఆయన అమిత్ షాకు వివరించారు. ఈ భేటీ సందర్భంగా, చంద్రబాబు వివిధ ప్రాజెక్టులు మరియు అభివృద్ధి కార్యక్రమాలకు ఆర్థిక సహాయం ఆవశ్యకతను వివరించారు. రాష్ట్ర విభజన కారణంగా ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొన్న ఆర్థిక నష్టాలను పరిగణనలోకి తీసుకోవాలని 16వ ఆర్థిక సంఘాన్ని కూడా ఆయన అభ్యర్థించారు. మిగతాది 2లో...



# ముస్లింలను కలిపి బీసీలకు అన్యాయం చేసే కుట్ర



### తెలుగు రాష్ట్రాల సీఎంల సమావేశంలో రేవంత్ రెడ్డి తెలంగాణ వాదన గట్టిగా వినిపించాలి!: బండి సంజయ్
### తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేయదన్న బండి సంజయ్
### కేంద్ర ప్రభుత్వానికి రెండు రాష్ట్రాలు సమానమేనని వ్యాఖ్య
### ముస్లింలను కలిపి బీసీలకు అన్యాయం చేసే కుట్ర జరుగుతోందని ఆరోపణ

# ఇరిగేషన్ మాజీ ఈఎన్‌సీ అరెస్ట్

హైదరాబాద్,**జులై15(జర్నలిస్ట్ వార్త)** రాష్ట్రంలో నీటిపారుదల శాఖకు చెందిన మరో అవినీతి తిమింగళం ఏసీబీ వలకు చిక్కింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ ఇంజినీర్ ఇన్ చీఫ్(ఈఎన్సీ)గా పని చేసి రిటైర్ అయిన సి. మురళీధర్‌రావుకు చెందిన కోట్లాది రూపాయల అక్రమాస్తుల గుట్టును రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు మంగళవారం రట్టు చేశారు. ఏసీబీ డైరెక్టర్ జనరల్ విజరుకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నీటిపారుదల శాఖ రిటైర్డ్ ఇంజినీర్ మురళీధర్‌రావు అవినీతి, అక్రమాలకు పాల్పడి కోట్లాది రూపాయల విలువైన ఆదాయానికి మించిన ఆస్తులను సంపాదించినట్టు ఏసీబీకి విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఏసీబీ అధికారులు హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌తోపాటు కరీంనగర్, హుజూరాబాద్‌లలోని మురళీధర్‌రావుకు చెందిన ఆస్తులు, వారి సమీప బంధువుల ఆస్తులపై మెరుపుదాడులను నిర్వహించారు. మొత్తం 11 ప్రాంతాల్లో ఈ మెరుపుదాడులు సాగించారు. ఈ దాడుల్లో మురళీధర్‌రావు కొనుగోలు చేసిన విల్లాలు, అపార్ట్‌మెంట్‌లు, విలువైన ప్రాంతాల్లో ఇండ్ల స్థలాలు, ఎకరాల్లో వ్యవసాయ భూమితో పాటు నివాసంలో అత్యంత విలువైన బంగారు నగలు, నగదును ఏసీబీ అధికారులు కనుగొన్నారు. వీరు జరిపిన దాడుల్లో%ా% కొండాపూర్‌లోని ఒక విల్లా, బంజారాహిల్స్, యూసఫ్‌గూడ, బేగంపేట్, కోకాపేట్‌లలో ఒకటి చొప్పున ఫ్లాట్‌లు, హైదరాబాద్, కరీంనగర్‌లో ఒకటి చొప్పున కమర్షియల్ బిల్డింగ్‌లు, కోదాడలో ఒక అపార్ట్‌మెంట్, జహీరాబాద్‌లో ఒక 2కేడబ్ల్యూ సోలార్ పవర్ ప్రాజెక్ట్, వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న ఒక అపార్ట్‌మెంట్‌ను గుర్తించారు. అలాగే, హైదరాబాద్‌లో నాలుగు రెసిడెన్షియల్ ప్రైమ్ ఓపెన్ ప్లాట్లు, మోకిలాలో 6500 చదరపు గజాల భూమి, మెర్సిడిస్ బెంజ్ కారుతో సహా మూడు ఫోర్ వీలర్ వాహనాలు, బంగారు ఆభరణాలు, బ్యాంకు డిపాజిట్లను అధికారులు కనుగొన్నారు. ప్రస్తుతం దాడుల్లో బయటపడిన ఆస్తుల మార్కెట్ విలువ ఐదింతలు ఎక్కువగా ఉంటుందనీ, అది కోట్లాది రూపాయల్లో ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు. నిందితుడు మురళీధర్‌రావుపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసును నమోదు చేయటంతో పాటు అరెస్టు చేశామని అధికారులు తెలిపారు. ఇంకా ఆయన ఆస్తులపై సోదాలు కొనసాగుతున్నాయని చెప్పారు.

# ముగిసిన శుభాంశు రోదసీయాత్ర

(మొదటి పేజి తరువాయి)

మానవాళికి ఉపయోగపడే ప్రయోగాలు చేశారు. అనంతరం డ్రాగన్ క్యాప్స్‌లో కాలిఫోర్నియా సమీపంలోని సముద్ర జలాలలో మంగళవారం మధ్యాహ్నం 3.01 గంటలకు సురక్షితంగా దిగారు. భూమికి తిరిగి రావడం సంతోషంగా ఉందని యాక్సియం-4 కమాండర్ పెగ్గీ విట్సన్ తెలిపారు.అంతరిక్ష పరిశోధన కేంద్రంలో అడుగుపెట్టిన తొలి భారతీయుడిగా శుభాంశు శుక్లా రికార్డు సృష్టించారు. కాగా, భూమిపైకి చేరుకున్న ఈ వ్యోమగాయుల బృందాన్ని ఏడు రోజుల పాటు క్వారెంటైన్‌లో ఉంచనున్నట్లు స్పేస్ ఎక్స్ అధికారులు తెలిపారు. శుభాంశు శుక్లా బృందం భూమికి సురక్షితంగా చేరుకోవడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఐఎస్‌ఎస్‌ను సందర్శించిన తొలి భారతీయ వ్యోమగామిగా చరిత్ర సృష్టించిన శుభాంశు.. పట్టుదల, అంకితభావం, సాహస చర్యల ద్వారా కోట్లాది మందికి స్ఫూర్తిగా నిలిచారని ఎక్స్ వేదికగా కొనియాడారు. ఇది మన సొంత మానవ సహిత అంతరిక్ష ప్రయోగం గగన్‌యాన్‌కు దిక్సూచిగా నిలుస్తుందన్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో పలు పరిశోధనలు చేపట్టిన యాక్సియం-4 మిషన్ బృందం.. స్పేస్‌ఎక్స్‌కు చెందిన క్రూ డ్రాగన్ గ్రేస్ వ్యోమనౌకలో సోమవారం బయలుదేరింది. భారత వ్యోమగామి శుభాంశు శుక్లాతో పాటు పెగ్గీ విట్సన్, స్లావోస్జ్ ఉజ్నాన్స్‌కీ-విస్నియెస్కీ, టిబర్ కపులు ఈ బృందంలో ఉన్న సంగతి తెలిసిందే.ఇకపోతే శుభాంశు శుక్లా తిరిగి భూమికి చేరుకోవడంపై సర్వత్ర హర్షం వ్యక్తం అవుతోంది. ఆయన తిరిగి భూమికి వచ్చిన సందర్భంగా స్వస్థలం లక్నోలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆయన తల్లిదండ్రులు భావోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకున్నారు.

# కాల్పుల కలకలం

పోలీసుల వివరాలు ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట గ్రామానికి చెందిన సీపీఐ రాష్ట్ర నాయకులు కేతావత్ చందు నాయక్ రాథోడ్ చైతన్యపురిలో నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం తన భార్య, కుమార్తెతో కలిసి మలక్‌పేట్‌లోని శాలివాహననగర్ పార్కులో వాకింగ్‌కు వచ్చారు. వాకింగ్ చేస్తున్న సమయంలో ఉదయం 7.20 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు వచ్చి ముందుగా చందునాయక్ కండ్లలో కారం చల్లారు. ఆయన తెరుకునేలోపే తుపాకులతో ఆరు రౌండ్లు కాల్పులకు తెగబడ్డారు. ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. కాల్పుల మోత వినిపించడంతో పార్కులోని వాళ్లందరూ భయాందోళనతో పరుగులు తీశారు. సమా చారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కొన్ని ప్రాథమిక ఆధా రాలు సేకరించారు. పాత కక్షల నేపథ్యంలోనే ఈ హత్య జరిగిందని పోలీసులు అనుమానిస్తున్నారు. సోమవారం రాత్రి నుంచే చందునాయక్ ఇంటిదగ్గర కొందరు అనుమానాస్పదంగా సంచరించినట్టు సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు గుర్తించారు. మృతుని భార్య, కుటుంబ సభ్యులు ఇంటికి వెళ్లిన తర్వాతే చందునా యక్‌పై దాడి చేసినట్టు వారు తెలిపారు. 2022లో ఎల్బీనగర్ పరిధిలో జరిగిన ఎమ్మార్పీఎస్ నాయకుల హత్య కేసులో చందునాయక్ నిందితునిగా ఉన్నారు. కాగా, చందు నాయక్ ఎక్కడికి వెళ్లినా భార్యా పిల్లలు వెంట ఉంటారని స్థానికులు, బంధు వులు తెలిపారు. ఈ కేసును పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్‌ఐ పిడమర్తి నరేశ్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని డీసీపీ చైతన్యకుమార్, ఏసీపీ సుబ్బరామిరెడ్డి పరిశీలించారు. చందునాయక్ మరణ వార్త విని అభిమానులు, బంధువులు, స్నేహితులు ఆయన స్వగృహానికి భారీగా తరలివచ్చారు. సంఘ టనా స్థలాన్ని తనిఖీ చేసిన క్లూస్ టీమ్స్ కీలక ఆధా రాలను సేకరించాయి. ఇదిలావుండగా కాల్పులకు తెగబడ్డ నింది తులు పోలీసుల అదుపులో ఉన్నట్టు పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది.

# బనకచర్లపై చర్చ అవసరం లేదు

(మొదటి పేజి తరువాయి)

గోదావరి - బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై చర్చించడం అనుచితమని పేర్కొంది. ఇలాంటి చర్యలతో కేంద్ర ప్రభుత్వ నియంత్రణ సంస్థలపై నమ్మకం పోతుందని పేర్కొంది.కాగా, గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయమై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్ రెడ్డిలతో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ రేపు సమావేశం కానున్నారు. ఈ మేరకు జలశక్తి శాఖ ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల కార్యాలయాలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు సమాచారం పంపించింది. ఢిల్లీలోని జలశక్తి ప్రధాన కార్యాలయం శ్రమశక్తి భవన్‌లో మధ్యాహ్నం రెండున్నర గంటలకు ఈ సమావేశం జరగనుంది. ఈ అంశంతో పాటు ఏమైనా అజెండా అంశాలు ఉంటే పంపించాలని జలశక్తి శాఖ కోరింది.

# ముస్లింలను కలిపి బీసీలకు అన్యాయం చేసే కుట్ర

హైదరాబాద్,**జులై15(జర్నలిస్ట్ వార్త)**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరగనున్న సమావేశంలో తెలంగాణ వాణిని బలంగా వినిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సూచించారు. కేంద్ర జలశక్తి శాఖ నుంచి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు పిలుపు వచ్చింది. రేపు ఈ సమావేశం జరగనుంది. ఈ నేపథ్యంలో బండి సంజయ్ స్పందించారు.తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం చేయదని ఆయన అన్నారు. కేంద్రానికి రెండు రాష్ట్రాలు సమానమేనని స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు జరిగే నష్టాన్ని ముఖ్యమంత్రి వివరించాలని సూచించారు. కరీంనగర్‌లో పర్యటించిన బండి సంజయ్ మాట్లాడుతూ, బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసే అన్యాయాన్ని బీసీ సంఘాలు ఎందుకు ప్రశ్నించడం లేదని ఆయన నిలదీశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన సమగ్ర సర్వేలో బీసీలు 51 శాతమని తేలితే, కాంగ్రెస్ సర్వేలో మాత్రం 46 శాతంగా ఉండటం ఏమిటని ప్రశ్నించారు.బీసీలలో ముస్లింలను కలపడం సరికాదని ఆయన అన్నారు. బీసీ ఆర్డినెన్స్‌ను తాము వ్యతిరేకించబోమని, కానీ బీసీల్లో ముస్లింలను కలిపితే మాత్రం అడ్డుకుంటామని తేల్చి చెప్పారు. బీసీ రిజర్వేషన్లలో ముస్లింలను కలుపుతూ అన్యాయం చేస్తోందని, బీసీ నాయకులు ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు.

# భారత్‌లో అడుగుపెట్టిన టెస్లా

## ముంబైలో తొలి షోరూమ్ ప్రారంభం -ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సిఎం ఫడ్నవీస్

ముంబై,**జులై15(జర్నలిస్ట్ వార్త)**

టెస్లీ కార్లు ఇక భారత రోడ్లపై పరుగెట్టనున్నాయి. ఎంతోకాలంగా అభిమానులు ఎదురు చూస్తున్న ఘడియ వచ్చింది. అమెరికాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా భారత మార్కెట్లోకి ప్రవేశించింది. ముంబయిలో తొలి షోరూంను మంగళవారం ప్రారంభించింది. బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని మార్కర్ మ్యాక్సిటీ మాల్‌లో దానిని తెరిచింది. ఈ షోరూం ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ హాజరయ్యారు. భారత్‌లో తొలిగా ముంబైలో అడుగుపెట్టిన ఈ సంస్థకు ఘనంగా స్వాగతం చెప్పారు. షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం దేవేంద్ర ఫడణవీస్ మాట్లాడుతూ టెస్లా సరైన రాష్ట్రం, నగరాన్ని ఎంచుకుంది. ఈ కంపెనీ కార్ల డిజైన్, ఇన్నోవేషన్‌పై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి ఉంటుంది. 2015లో అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు తొలిసారి టెస్లా కారులో తిరిగానని ఫడణవీస్ అన్నారు. టెస్లా దీర్ఘకాలిక ప్రణాళికల గురించి ఎన్నో ఊహాగానాలు వినిపిస్తున్నప్పటికీ.. ప్రస్తుతానికి స్థానికంగా దీని తయారీపై ఎలాంటి ప్రకటనా వెలువడలేదు.భారత్‌లో ఈ ఎలక్ట్రిక్ కార్ల తయారీకి సంబంధించిన భవిష్యత్ ప్రణాళికలపై ఆశాభావం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా 'మోడల్ వై' కారును సంస్థ ఆవిష్కరించింది. తొలుత 'మోడల్ వై' ఈవీలను -టె-స్లా భారత్ మార్కెట్లో విక్రయించనుంది. ఇక్కడ





ఆర్‌డబ్ల్యూడీ వెర్షన్ (బేస్) 'మోడల్ వై' ఆన్‌రోడ్ ధర రూ.61.07 లక్షలుగా నిర్ణయించింది. లాంగ్‌రేంజ్ వెర్షన్ ధర రూ.69.15లక్షలుగా ఉంది. బేస్ మోడల్ ధర అమెరికాలో 44,990 డాలర్లు (రూ.38.63 లక్షలు), చైనాలో 2,63,500 యువాన్లు (రూ.31.57లక్షలు) జర్మనీలో 45,970 యూరోలు (రూ.46.09లక్షలు)గా ఉంది. దిగుమతి సుంకాలు, రవాణా ఖర్చుల కారణంగా భారత్‌లో దీని ధర ఎక్కువగా ఉంది. కొన్నిరోజుల క్రితం భారత రోడ్లపై 'మోడల్ వై' ను పరీక్షించిన సంగతి తెలిసిందే. ముంబయి-పుణే జాతీయరహదారిపై ఈ వాహనం దర్శనమివ్వడం చూపరులను ఆకర్షించింది. ఇది పూర్తిగా అప్‌డేట్ అయిన మోడల్ కారుగా నిపుణులు గుర్తించారు. దీని కోడ్‌నేమ్ జునిపెర్. అడ్వాన్స్‌డు వర్షన్‌ను అమెరికా, కెనడా మార్కెట్లలో వీటిని విక్రయిస్తున్నారు. దీని సీ షేప్‌లోని ఎల్‌ఈడీ లైట్లు-, ట్విన్ స్పోక్ అలాయ్ వీల్స్, -టె-స్లా ప్రత్యేకతను తెలిపే గ్లాస్ రూఫ్ ఉన్నాయి. ఇది భారత్‌లో ఆరు రంగుల్లో లభించవచ్చని భావిస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా మోడల్ వై కారు ఆల్‌వీల్ డ్రైవ్‌గా లభిస్తోంది. వీటిల్లో లాంగ్ రేంజ్ బ్యాటరీ ప్రత్యేకత. ఒక్కసారి ఛార్జి చేస్తే 500-600 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చు. కేవలం 4.6 సెకన్లలో గంటకు 0-96 కిలోమీటర్ల వేగాన్ని అందుకొంటుంది. అత్యధికంగా గంటకు 200 కి.మీ. వేగంతో ప్రయాణించగలదు. దీనిలో భారీ 15.4 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌ను అమర్చారు. వెనక సీట్లలోని ప్యాసింజర్ల కోసం 8 అంగుళాల ప్రత్యేకమైన స్క్రీన్ కూడా ఉంటు-ంది. అడాస్ ఫీచర్లు, వైర్‌లెస్ ఫోన్ ఛార్జింగ్ వంటి హంగులు ఇందులో కస్టమర్లకు లభించనున్నాయి.

# విద్యార్థుల మరణాలకు రేవంత్ బాధ్యత వహించాలి: కేటీఆర్

**ఫుడ్ పాయిజనింగ్ కారణంగా వందకు పైగా విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారన్న కేటీఆర్**

**రేవంత్ ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదని విమర్శ**

హైదరాబాద్,**జులై15(జర్నలిస్ట్ వార్త)**

రాష్ట్రంలో విద్యార్థుల ఫుడ్ పాయిజనింగ్ ఘటనలకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విమర్శలు గుప్పించారు. ఈ ఘటనలకు, విద్యార్థుల మరణాలకు రేవంత్ పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఏడాది కాలంలో వేలాది మంది విద్యార్థులు ఫుడ్ పాయిజనింగ్ తో అనారోగ్యం పాలయ్యారని, వందకు పైగా విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ కూడా ఆయన చేతిలోనే ఉన్నప్పటికీ ఇంతవరకు ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదని విమర్శించారు.

కనీసం ఒక తండ్రిగానైనా రేవంత్ స్పందించాలని... పిల్లలు కలిగిన ఒక తండ్రిగా కోరుతున్నానని కేటీఆర్ అన్నారు. మీ పిల్లలకు విషం కలిపిన ఆహారాన్ని ప్రభుత్వం పెడితే మీరు ఊరుకుంటారా? అని ప్రశ్నించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి సరైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారని... తగిన సమయంలో తీర్పు ఇస్తారని చెప్పారు.

# బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్

(మొదటి పేజి తరువాయి)

ప్రపంచ దేశాలకు సరఫరా చేయగలిగామని సీఎం అన్నారు. శామీర్‌పేట జీనోమ్‌వ్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించారు. ఐకోర్ బయోలాజిక్స్ పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. మంగళవారం ఐకార్ బయోలజిక్స్ కొత్త యూనిట్ కు సిఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశంలోనే 33 శాతం వ్యాక్సిన్స్ , బల్క్ డ్రగ్స్‌లో 43 శాతం ఇక్కడి నుంచే ఉత్పత్తి అవుతున్నాయని నొక్కిచెప్పారు. కోవిడ్ సమయంలో జీనోమ్ వ్యాలీ నుంచే ప్రపంచ దేశాలకు వ్యాక్సిన్‌ను ఎగుమతి చేసిన ఘనత ఇక్కడి పారిశ్రామికవేత్తలదని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు.ప్రభుత్వాలు మారినా పారిశ్రామిక విధానాన్ని ముందుకు తీసుకెళ్లే విధంగానే ప్రభుత్వాల నిర్ణయాలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం మరింత సరళమైన విధానాలతో ముందుకెళ్తుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ డేటా సిటీగా మారనుందని ఉద్ఘాటించారు. తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ. 3లక్షల 28 వేల కోట్లు పెట్టుబడులు సాధించామని స్పష్టం చేశారు. ప్రపంచ దేశాలతో పోటీ- పడాలని, అధునాతన విధానాలను తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామని చెప్పుకొచ్చారు. రాబోయే పదేళ్లలో తెలంగాణను వన్ ట్రిలియన్ ఎకానమీగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని నొక్కిచెప్పారు. ఇందుకు జీనోమ్ వ్యాలీ పారిశ్రామికవేత్తల సహకారం ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.అంతకుముందు మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. జీనోమ్‌వ్యాలీ ఆసియా ఖండంలోనే ప్రత్యేకమైందిగా గుర్తింపు పొందిదన్నారు. జీవ శాస్త్రాల అభివృద్ధికి అవసరమైన ఎకో సిస్టమ్ హైదరాబాద్‌లో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, వివేక్, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు.

# ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసిన ఏపీ సీఎం చంద్రబాబు

(మొదటి పేజి తరువాయి)

పోలవరం-బనకచెర్ల లింక్ ప్రాజెక్ట్ గురించి కూడా చర్చ జరిగింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా పోలవరం నుండి 200 టీఎంసీల వరద నీటిని కర్నూలు జిల్లాలోని బనకచెర్ల రెగ్యులేటర్‌కు మళ్లించి కరువు పీడిత రాయలసీమ ప్రాంతానికి ప్రయోజనం చేకూర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చంద్రబాబు తెలిపారు. గోదావరి నది మిగులు జలాలను ఉపయోగించుకోవడానికి ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న హక్కును చంద్రబాబు నొక్కి



చెప్పారు.గోవా గవర్నర్‌గా సీనియర్ టీడీపీ నాయకుడు అశోక్ గజపతి రాజును నియమించినందుకు ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. చంద్రబాబు నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సరస్వత్‌తో రాయలసీమ ప్రాంతంలో ఏరోస్పేస్ మరియు డిఫెన్స్ పరిశ్రమల స్థాపనపై చర్చించారు. అలాగే, విశాఖపట్నం మరియు విజయవాడలలో మెట్రో ప్రాజెక్టులపై చర్చించడానికి ఢిల్లీ మెట్రో రైల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వికాస్ కుమార్‌తో కూడా సమావేశమయ్యారు.

# మల్లు భట్టివిక్రమార్కకు బీజేపీ అధ్యక్షుడు లీగల్ నోటీసులు

**రోహిత్ వేముల ఆత్మహత్య అంశంపై రామచందర్ రావుపై ఆరోపణలు**

**తనకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీజేపీ అధ్యక్షుడి డిమాండ్**

**లేదంటే రూ. 25 కోట్లకు పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరిక**


హైదరాబాద్,**జులై15(జర్నలిస్ట్ వార్త)**

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు లీగల్ నోటీసులు పంపించారు. రోహిత్ వేముల ఆత్మహత్య అంశంపై భట్టివిక్రమార్క చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ఆయన తరపు న్యాయవాది విజయ్‌కాంత్ ద్వారా ఈ నోటీసులు పంపించారు.

తనపై నిరాధార ఆరోపణలు చేసినందుకు మల్లు భట్టివిక్రమార్క మూడు రోజుల్లో బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆ నోటీసుల్లో డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో రూ. 25 కోట్లకు పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. క్షమాపణ చెప్పని పక్షంలో క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని కూడా పేర్కొన్నారు.

# గవర్నర్ వద్దకు బీసీ రిజర్వేషన్ల ముసాయిదా

హైదరాబాద్,**జులై15(జర్నలిస్ట్ వార్త)**



బీసీలకు రిజర్వేషన్ల పెంపు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించి న ఆర్డినెన్స్ ముసాయిదా మంగళవారం రాజ్‌భవన్‌కు చేరింది. రిజర్వేషన్ల పెంపునకు వెసులుబాటు కల్పిస్తూ పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 285 క్లాజ్-ఎ సవరించాలని ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఆ సెక్షన్‌లో స్థానిక సంస్థల్లో 50 శాతానికి మించకుండా రిజర్వేషన్లు అమలవుతాయని ఉండగా..ఇప్పుడు 50 శాతానికి మించకుండా అనే వాక్యాన్ని తొలగిస్తూ ముసాయిదా రూపొందించింది. బీసీ రిజర్వేషన్ల పంచాయితీకి సాధ్యమైనంత త్వరగా ముగింపు పలకాలనే ఆలోచనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారు. మంత్రి సీతక్క కార్యాలయం నుంచి ముసాయిదా సీఎంవోకు వచ్చిన వెంటనే దాన్ని గవర్నర్ పరిశీలనకు పంపారు. గవర్నర్ ఆమోదం పొందిన వెంటనే వారం రోజుల్లోగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు పంచాయతీరాజ్ శాఖ కసరత్తు చేస్తోంది.

# క్రైస్తవులందరూ కలిసికట్టుగా ఉండాలి

**టీ సీ సీ రాష్ట్ర నాయకులు ఎండి సుదర్శన్**



**తల్లాడ/జులై15(జర్నలిస్ట్ వార్త):** క్రైస్తవులందరూ కలిసికట్టుగా ఉండాలని టీ సీ సీ రాష్ట్ర నాయకులు ఎండి సుదర్శన్ అన్నారు.మంగళవారం తల్లాడ అంబేద్కర్ భవనంలో.టీ సీ సీ నూతన కమిటీ ఏర్పాటు చెయ్యగా ముఖ్య అతిథిగా టీ సీ సీ రాష్ట్ర నాయకులు ఎండి సుదర్శన్ హాజరై మాట్లాడుతూ క్రైస్తవులందరూ కలిసికట్టుగా ఉండలని దేవుని ప్రార్థన మందిరంలో ప్రార్థనలు చేసే సేవకులకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని నిరుపేద క్రైస్తవుల్ని ఆదుకోవాలని తెలిపారు.
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోసం ప్రార్థించాలని గుర్తు చేశారు. అనంతరంమండల పరిధిలో నూతన కమిటీ నిర్వహించారు. అధ్యక్షులు బ్రదర్ కె ఇశ్రాయేలు టీ సీ సీ సభ్యులందరూ కలిసి మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో దైవ సేవకులు మండలఉపాధ్యక్షులు ఇ ప్రకాష్ రావు సెక్రెటరీ జి దేవ సహాయం తల్లాడ మండలం . టీ సీ సీ మహిళా అధ్యక్షురాలు.డి దీవనమ్మ సత్తుపల్లి నియోజవర్గ మహిళా అధ్యక్షురాలు ఐ కర్ణమ్మ ముఖ్య సలహాదారులు జై ఆనందరావు సులేమాన్, జి బాబు ఆనందరావు ,ఈ ప్రకాష్ రావు ,హరికృష్ణ ,టి కృష్ణ ,జి వెంకటేష్ , ఐ సల్మాన్, దేవ తదితరులు పాల్గొన్నారు.

# రైటింగ్ పోటీలో ద్వితీయ బహుమతి పొందిన చిలపాక ద్రాక్షాయని



**చెన్నారావుపేట/జూలై15(జర్నలిస్ట్ వార్త):** రంగశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన కామిక్ రైటింగ్ పోటీలో చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి చిలపాక ద్రాక్షాయని ద్వితీయ బహుమతి సాధించింది.విద్యార్థులు మాదకద్రవ్యాల వ్యసనాల బారిన పడకుండా ఉండడానికి తీసుకోవలసిన జాగ్రత్తలపై నిర్వహించిన ఈ పోటీలలో గైడ్ టీచర్ గా బయలాజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు గజవెల్లి సుందర్ వ్యవహరించారు. వరంగల్ జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారి ఉంద్రాతి సుజన్ తేజ, రంగశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం రామకృష్ణారెడ్డి,నాగేశ్వరరావు చేతుల మీదుగా ద్వితీయ బహుమతి మరియు ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమం న్యాయ నిర్ణేతలుగా లక్ష్మణ్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా స్థాయి ద్వితీయ బహుమతి పొందిన ద్రాక్షాయని, గైడ్ టీచర్ సుందర్ లను, సహకరించిన బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు శశిధర్ ను హెచ్ఎం జయతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

# గోతికోయ గ్రామాల్లో వైద్య శిబిరం.

**కన్నాయిగూడెం. పిహెచ్సి. వైద్యాధికారి డా, అభినవ్.**



**కన్నాయిగూడెం/జులై15 (జర్నలిస్ట్ వార్త):** ప్రతిఒకరు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కన్నాయిగూడెం పిహెచ్సి వైద్యాధికారి డా, అభినవ్ అన్నారు. మంగళవారం సిబ్బందితో కలిసి మండలంలోని ఆరోగ్య ఉపకేంద్రం సర్వాయి పరిధి గుత్తికోయగూడెం, పాలాయిగూడెం గ్రామాల్లో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న రోగులను పరిశీలించి మలేరియా ఆర్డిటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేయబడింది, అంతేగాక, దోమ కాట్ల నివారణ, లార్వా నియంత్రణ చర్యల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించదంజరిగింది, ఒక ప్రసూతి తర్వాతి (పిఎన్సి) కేసును గుర్తించి, ఆమెకు బిడ్డకు తినిపించాల్సిన తల్లిపాలు ప్రాముఖ్యత, సక్రమంగా పిల్లలను పెంచే విధానాలు మరియు వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించబడింది. హెల్త్ ఎడ్యుకేటర్ సుజాత, ఆస్పిరేషనల్ బ్లాక్ కోఆర్డినేటర్ శ్రీ రవీష్, హెల్త్ అసిస్టెంట్ శ్రీ లక్ష్మణ్, ఎఎన్ఎం, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిగోడ నెల మట్టం

**ఇందిరమ్మ పథకంలో ఇందిరమ్మ ఇల్లు ఇప్పించి నిరుపేద దళిత వేడుకోలు**



**కన్నాయిగూడెం/జులై15(జర్నలిస్ట్ వార్త):** కన్నాయిగూడెం మండలంలోని గుర్రేవుల గ్రామంలో వాసంపల్లి సుశీల నర్సింహా రావు, దంపతుల శిదిలావస్థాల్లో ఉన్న ఇంటి గోడ ఇటీవల కురిసిన వర్షాలకు మంగళవారం మధ్యాహ్నం నెల మట్టమైంది దని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తూన్నారు. సంబంధిత అధికారులు స్పందించి, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ పథకంలో ఇందిరమ్మ ఇల్లు ఇప్పించి నిరుపేద దళిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

# రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయ్యాలి

**- కె.వి.పి.ఎస్ జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్.**



**ఏటూరునాగారం/జులై15(జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయ్యాలని కె.వి.పి.ఎస్ జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్ అన్నారు. మంగళవారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం,(కెవిపిఎస్) ములుగు జిల్లా ముఖ్య నాయకుల సమావేశం జిల్లా అధ్యక్షులు అంబాల మురళి అధ్యక్షతన గోవిందరావుపేట మండలం పస్రా ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, అంబాల మురళి, రత్నం ప్రవీణ్, లు మాట్లాడుతూ ఈ సమాజంలో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన సామాజిక అంతరాలను కుల వివక్షతను అంటరానితనాన్ని మూఢనమ్మకాలను నిర్మూలించడం కోసం కేవీపిఎస్, పనిచేస్తున్నదని ఈ రాష్ట్రంలో అనేక ఉద్యమాలు నిర్వహించి,ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ సాధించుకోవడం జరిగిందని అదేవిధంగా భవిష్యత్తులో దళిత గిరిజనులకు జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయింపు చేయాలని కుల వివక్ష అంటరానితనం పై నిరంతరం పోరాడుతూ కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ప్రభుత్వం నుండి ప్రోత్సాహకాలు సకాలంలో అందించాలని కోరారు, అలాగే సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు వసతులు మెరుగుపరచాలని దళిత బహుజనులు అందరికీ ఉచిత విద్యుత్తు 200, యూనిట్ల నుంచి 300, యూనిట్ల వరకు ఇవ్వాలని అనేక పోరాటాలు చేస్తూ అలాగే కులదురహకారా హత్యలు ఎక్కడ జరిగిన వాటిని ప్రశ్నిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తుందనన్నారు, అలాగే దళిత బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తుందని అన్నారు, ఈ దేశంలో దళిత గిరిజన, బడుగు బలహీన వర్గాల మైనారిటీల హక్కుల ఆయుధంగా ఉన్న భారత రాజ్యాంగాన్ని రద్దు చేయడం కోసం ప్రయత్నాలు చేస్తున్న కేంద్ర పాలకుల కుట్రలను నిరంతరం ఎండగడుతూ యువకుల్లో ప్రజల్లో చైతన్యం తీసుకురావడం కోసం పని చేస్తుందని అలాగే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్న తరుణంలో ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రైవేట్ రంగంలో పని చేస్తున్న దళిత బడుగు బలహీన వర్గాలకు రిజర్వేషన్స్ కుల మత భాష ప్రాంత లింగ బేధం లేకుండా కల్పించాలని పోరాడుతుందనన్నారు, అంతేకాకుండా నేడు నిత్యం మతకలహాలు విద్వేషాలు హింస వైపు అడుగులు వేస్తున్న బిజెపి ఆర్ఎస్ఎస్, విధానాలను యువకులు ప్రజలు అంత సమైక్యంగా ఎదుర్కొంటూ భారత రాజ్యాంగాన్ని ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించుకోవాలని పిలుపునివ్వడం జరిగింది, ఈ విధమైన దేశ సామాజిక ఆర్థిక రాజకీయ భౌగోళిక అంశాల పైన అవగాహన కల్పించడం కోసం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు ఈనెల 22,23,24, తేదీలలో సూర్యపేట పట్టణంలో నిర్వహించడం జరుగుతున్నది ఆయా శిక్షణ తరగతులను జయప్రదం చెయ్యాలని కోరడం జరిగింది, ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మాణిక్యం దేవేందర్, జిల్లా కమిటీ సభ్యులకు కోటయ్య, జగదీష్, నరేష్, యాదగిరి, మహేందర్, తదితరులు పాల్గొన్నారు,

# మావోయిస్టులకు వ్యతిరేకంగా వాల్ పోస్టర్లు కలకలం



**ఏటూరునాగారం/జులై15(జర్నలిస్ట్ వార్త)** ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని పలు గుత్తికోయగూడాలలో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మావోయిస్టులకు వ్యతిరేకంగా మావోయిస్టుల పరిరక్షణ ప్రజా ఫ్రంట్ పేరుతో పోస్టర్లు వెలిశాయి. ఇందులో భాగంగా మావోయిస్ట్ లకు వ్యతిరేకంగా ప్రజా ఫ్రంట్ తెలంగాణ పేరు మీద ములుగు జిల్లా మావోయిస్టులు సిద్ధాంతం కోసం అడవి పాలైన అన్నల్లారా అక్కల్లారా, మీరు నమ్మిన సిద్ధాంతం సామాన్యునికి అశాకిరణం ఎన్నడైంది ? మీకు ఎదురైన సవాళ్లు, తద్వారా వచ్చే పరిణామాలు విశ్లేషిస్తే మీకు ఆత్మసంతృప్తిని మిగిల్చిందేంది
ఆత్మసంతృప్తి లేని ఆత్మగౌరవంతో ముందుకు పోతున్న మీ 40 ఏండ్లనాటి ఉద్యమ బాట ప్రజాధరణ లేక మోడువారిన బీడు భూమిలాగా అయ్యింది
మావోయిస్టు అగ్ర నాయకుల్లారా
ఇకనైనా మీ కాలం చెల్లిన సిద్ధాంతాన్ని వీడి, కాలానుగుణంగా మారిన ప్రజల జీవన విధానంలో పాత్రులు కండి అడవిని వీడి ప్రజల్లోకి రండి ప్రజాస్వామ్య గొంతుక కండి..! ఆయుధాలు మనకొద్దు - ప్రజామోద మార్గమే మనకు ముద్దు ఆయుధాలు వీడండి- జనజీవన స్రవంతిలోకి రండి..! మీ మేధస్సును ప్రజల అభివృద్ధికి ఉపయోగించండని పోస్టర్ లో సూచించారు.



# రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇండ్లు

**- ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ నిరంతర ప్రక్రియ. - పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశశ్విని రెడ్డి**





**రాయపర్తి/జులై15(జర్నలిస్ట్ వార్త):**రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశశ్విని రెడ్డి అన్నారు.మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణంలో అర్హులైన 62 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశశ్విని రెడ్డి మాట్లాడుతూ అర్హులైన నిజమైన పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తున్నామని తెలిపారు.ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ నిరంతర ప్రక్రియ అని అన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని వర్గాల అభివృద్దే ద్యేయంగా పని చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వం అని అన్నారు.రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని అన్నారు.కార్యకర్తలందరూ సమన్వయంతో పని చేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.అన్నారు.అనంతరం వన మహొత్సవంలో భాగంగా మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ నాగమణి,తహసిల్దార్ శ్రీనివాస్,ఎంపీడీవో కిషన్,ఎంపీఓ ప్రకాష్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్యా నాయక్,మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి,వర్ధన్నపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండా కృష్ణారెడ్డి,పాలకుర్తి సోమనాథ ఆలయ చైర్మన్ కృష్ణమాచార్యులు,మాచర్ల ప్రభాకర్,రెంటాల గోవర్ధన్ రెడ్డి,నంగునూరి అశోక్,ఉల్లెంగుల యాదగిరి, చిర్ర మల్లయ్య,మచ్చ నిలయ్య,నర్సింహ మూర్తి,పాల్వంచ కోటేశ్వర్,ఎండీ అఫ్రోజ్,ఐరెడ్డి ఎల్లా రెడ్డి,గుగులోత్ యాకుబ్, ఎండీ గౌస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# కోతుల, కుక్కల భారీ నుండి
# హుజురాబాద్ పట్టణ ప్రజలను కాపాడండి

-పరిసరాల పరిశుభ్రతలో రోడ్లను శుభ్రం చేయండి

-మున్సిపల్ కమిషనర్ కు ఫోన్ ద్వారా సమస్యను వివరిస్తున్న బిఆర్ఎస్ మహిళా నేత ప్రభావతిరెడ్డి విజ్ఞప్తి



**హుజురాబాద్/జూలై15(జర్నలిస్ట్ వార్త):** హుజరాబాద్ పట్టణంలో విచ్చలవిడిగా కోతులు, కుక్కలు ప్రజల మీద పడి దాడి చేయడం, కరవటం నిత్యం జరుగుతున్న సంఘటనగా మారిందని, ఇలాంటి సంఘటనలు జరిగి ఇప్పటివరకు హుజురాబాద్ పట్టణంలో కొంతమంది గాయపడటం, పలువురు మరణించడం జరిగిందని ఇప్పటికైనా హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య స్పందించి వాటి భారీ నుండి ప్రజలను కాపాడాలని బిఆర్ఎస్ పార్టీ మహిళా సీనియర్ నాయకురాలు పూసల ప్రభావతి రెడ్డి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. నిత్యం కోతులు ఎక్కడపడితే అక్కడ తిరుగుతూ స్కూల్ కి వెళ్లే పిల్లల మీద, ఇంటి వద్ద ఉండే మహిళల పైన పడి కరవడంతో పాటు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయన్నారు. ఎంతో మంది గాయాల పాలవుతున్నప్పటికీ హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ పట్టించుకోకపోవడం చాలా బాధాకరమైన విషయం అని ప్రభావతిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. హుజురాబాద్ పట్టణములో ఎవరి ఇండ్ల మీద చూసిన కోతులు కనబడుతున్నాయనీ, ఈ కోతులు ప్రజలపై దాడి చేయడం, ఇళ్లల్లో చొచ్చుకొని వచ్చి ఇంట్లో వండిన ఆహార పదార్థాలు పాడు చేయడం, ఇతర వస్తువులను ఎత్తుకొని పోవటం ఇంట్లో ఉన్న వారు కోతులను వెల్లగొట్టడానికి ప్రయత్నం చేస్తే ఆ ఇంట్లో ఉన్న వ్యక్తులు మీద దాడి చేయడం, రోడ్ల వెంట వెళ్లే వారినీ కరవటం ఎక్కడంటే అక్కడ మీద దాడి చేసి గాయపరచటం ఇలాంటి సంఘటనలు నిత్యం జరుగుతూనే ఉన్నాయన్నారు. ప్రైవేట్ హాస్పిటల్ లకు వెళ్ల లేక ప్రభుత్వ హాస్పిటల్ కి వెళ్లి ఇంజక్షన్లు ఇచ్చుకోవడం ఇలాంటి సంఘటనలు ఎన్నో జరుగుతున్నాయన్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్, వారి సిబ్బంది దృష్టికి వచ్చినప్పటికీ కూడా వారు పట్టించుకోకపోవడం చాలా బాధాకరమైన విషయం అని ఆమె అన్నారు. గతంలో మున్సిపల్ పాలకవర్గం ఉన్నప్పుడు రెండు మూడు సార్లు కోతులను పట్టుకొని వెళ్లి ఇతర ప్రాంతాలలో, అడవిలో విడిచిపెట్టిన సంఘటనలు ఉన్నాయన్నారు. పాలకవర్గం సమయం ముగిసినప్పటి నుండి ఇప్పటివరకు ఒక్కసారి అయినా మున్సిపల్ కమిషనర్, సిబ్బంది ఈ కోతుల , కుక్కల గురించి ఒక్కసారి అయినా చర్యలు చేపట్టిన పాపాన పోలేదన్నారు. అందుకే కరీంనగర్ జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, హుజురాబాద్ ఆర్డీవో హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ చోరువా తీసుకొని వెంటనే కోతులను పట్టణము నుండి తరిమివేయడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలోని చాలా వాడాలల్లో అంతర్గత రహదారులు శుభ్రం చేయక చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నాయని వెంటనే పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చి రోడ్లపై చెత్త చెదరని తొలగించి శు భ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ కు ప్రభావతి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# రేషన్ కార్డులు పేదలకు వరం

-యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్






**హుజురాబాద్/జూలై15(జర్నలిస్ట్ వార్త):** రేషన్ కార్డులు పేదలకు వరమని యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్ అన్నారు. మంగళవారం హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు జమ్మికుంట మండల యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి, మంత్రుల చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో, ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో, మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ గార్ల చొరవతో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టిన సందర్భంగా,యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్ మాట్లాడుతూ, ఇందిరమ్మ రాజ్యం లో పేదలు సుభిక్షంగా ఉండాలనే ఇచ్చిన మాట ప్రకారం రేషన్ కార్డులు ఇవ్వడం జరిగిందనీ, రేషన్ కార్డు పేదవారి ఆత్మగౌరవం అని అన్నారు. 10 యేళ్ళు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రజలకు రేషన్ కార్డులు ఇవ్వాలన్న ఆలోచన మాత్రం చేయలేదనీ, మన ప్రజా ప్రభుత్వంలో సన్నబియ్యం కోసం రేషన్ షాపుల వద్ద ప్రజలు బారులు తీరుతున్నరన్నారు. కొత్తగా 5.6 లక్షల మందికి రేషన్ కార్డులు మంజూరు అయినవనీ, 26 లక్షల మంది పేర్లు కొత్తగా రేషన్ కార్డులలో నమోదు చేసి, 3.10 కోట్లమందికి సన్నబియ్యం పంపిణీ జరుగుతుందనీ తెలిపారు. రైతులు సంతోషంగా ఉంటేనే ఇందిరమ్మ ఆత్మ సంతోషంగా ఉంటుందనీ, సోనియమ్మ కల నెరవేరుతుందనీ అన్నారు. బిఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజాధనాన్ని దోచుకుందే తప్ప, పేదవారికి పట్టడం అన్నం పెట్టాలన్న ఆలోచన మాత్రం చేయలేదన్నారు. ప్రజలంతా ఆశీర్వాదాలతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గొప్ప మెజారిటీతో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలనీ కోరారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ హుజురాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు చల్లూరి రాహుల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వీరమనేని పరుశురాం,యూత్ కాంగ్రెస్ హుజురాబాద్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శులు పాతకాల రమేష్, రేవంత్, మండల ఉపాధ్యక్షులు అరుణ్, జమ్మికుంట మండల ఉపాధ్యక్షులు రాచపల్లి సాగర్, దేవునూరి వినయ్, ఆకినపల్లి శ్యామ్, ప్రధాన కార్యదర్శి బిజిగిరి శ్రీకాంత్, కార్యదర్శులు వొల్లాల రవి, యేబుషి అజయ్, యూత్ నాయకులు రాచపల్లి రాజు, ఏరెడ్డి సతీష్, జావిద్, ఇటుకల గణేష్, పచ్చిమట్ల భాను, బండి పవన్, దీపక్, వెంకటేష్, అష్రఫ్, జాన్సన్, సాయి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## వైరా రిజర్వాయర్ ఆయకట్టుకు నీళ్లు విడుదల చేసిన
# ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్



**వైరా/జూలై15(జర్నలిస్ట్ వార్త):** వైరా రిజర్వాయర్ ఆయకట్టుకు వేద మంత్రోత్సవాల మధ్య ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు , జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మంగళవారం నీళ్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మంగళవారం మాట్లాడుతూ ఈ రాష్ట్రాల పదేళ్ల తర్వాత అధికారులకు వచ్చాక రైతు కళ్ళల్లో ఆనందాన్ని చూస్తున్నామని ఆ ఆనందం కోసం కాంగ్రెస్ పార్టీ ఎక్కడ దాకా అయినా పోవడానికి సిద్ధంగా ఉందని కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతు పక్ష పార్టీ రైతు పచ్చగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా వైరా నియోజకవర్గ పరిధిలోని వైరా మండల హెడ్ క్వార్టర్ లో నియోజకవర్గానికి తలమానికంగా ఉన్న వైరా రిజర్వాయర్ నుంచి ఆ యొక్క ఆయకట్టుకు సాగునీళ్లు విడుదల చేసి రైతుల 22 వేల ఎకరాలకు సాగునీరు అందించడం వల్ల ఎక్కడున్నా రైతులు వారి యొక్క ఆనందానికి అవధులు లేకుండా పోయాయని శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ తెలియేసినారు ఈ సందర్భంగా వైరా రిజర్వాయర్ ఆయకట్ట రైతాంగ మొత్తం నీళ్లు విడుదల చేసిన సందర్భంగా వర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ, టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి, కొణిజర్ల మండల పార్టీ అధ్యక్షులు వడ్డే నారాయణరావు, దాసరి దానియేలు, రాష్ట్ర మాజీ మార్క్ ఫైడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పొదిల హరినాథ్, ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ దొడ్డ పుల్లయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, బోళ్ళ గంగారావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బిడికే రత్నం, పమ్మి అశోక్ , మట్టూరి వెంకటేశ్వరరావు, చప్పిడి వెంకటేశ్వరరావు, పణితి శ్రీను, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు, దొబ్బల సౌజన్య, పుచ్చకాయల వీరభద్రం, మొక్క శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య, వెజెండ్ల సాయి , చల్లా ప్రతిభ రెడ్డి, శీలం చంద్రశేఖర్ రెడ్డి, వీరంశెట్టి సీతారాములు, దర్నా రాజశేఖర్, షేక్ సైదా, నార్వనేని అశోక్, గుత్తా రామారావు, గుత్తా కళావతి, పొట్లపల్లి శ్రీను, శీలం సురేందర్ రెడ్డి, తేళ్ళూరి వీరయ్య, గోసు రాధాకృష్ణ, తోటకూర నాగేశ్వరరావు, పల్లం రాజు, మోరంపూడి బాబు, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి
# హెల్పింగ్ హాండ్స్ ఆర్థిక సహాయం



**రాయపర్తి/జులై15(జర్నలిస్ట్** వార్త):మండలంలోని శివరామపురం గ్రామానికి చెందిన గిద్దె రాజు ఇటీవల అనారోగ్యంతో మరణించగా మంగళవారం బాధిత కుటుంబాన్ని అంబేద్కర్ హెల్పింగ్ హాండ్స్ సభ్యులు పరామర్శించి 12000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని నిరుపేదలు హెల్పింగ్ హాండ్స్ సభ్యులు అండగా ఉంటారని అన్నారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధులు చెడుపాక పవన్,చెడుపాక కుమారస్వామి,చెడుపాక యాకయ్య,చెడుపాక రవి,కుక్కల మహేందర్,గారే ప్రశాంత్ చెడుపాక పరుశరాములు,చెడుపాక మధు,మైలపాక సోమయ్య,ఎల్లబెల్లి ఆనంద్,చెడుపాక నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి అండగా
# శ్రీనివాస్‌రెడ్డి చేయూత



**రాయపర్తి/జులై15(జర్నలిస్ట్ వార్త):**మండలంలోని శివరామాపురం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన గిద్దె రాజు ఇటీవల మరణించగా మంగళవారం బాధిత కుటుంబాన్ని ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి క్వింటా బియ్యం, ఆయిల్ క్యాన్ ను అందజేసి చేయూతనందించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోష్ గౌడ్,ఎలమంచి శ్రీనివాస్ రెడ్డి, ఐత రాంచందర్, నాగపూరి సోమన్న, గజావెల్లి ప్రసాద్, ఎండీ యూసఫ్,తాజా మాజీ సర్పంచ్ చెడుపాక కుమార్,గ్రామ పార్టీ అధ్యక్షులు భూక్య జగన్,పసునూరి యకూబ్ రెడ్డి, సంకినేని ఎల్లస్వామి, ఉబ్బని సింహాద్రి, ఐత జంపి, చెడుపాక యాకయ్య,వీరాస్వామి, రవి, యాకయ్య, అనిల్, గారే ప్రశాంత్, పవన్, విజయ్, నిఖిల్, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో గంజాయి పట్టివేత ఇద్దరికి రిమాండ్




**ఖమ్మం/జూలై15(జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం రాపర్తి నగర్ డంపింగ్ యార్డ్ సమీపంలో గంజాయి అమ్ముతున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 130 గ్రాములు గంజాయి దొరికినట్లు తెలిపారు. నేలకొండపల్లి మండలం తిరుమలపురానికి చెందిన బానోత్ గోపి సాయినాథ్ మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లా జర్పుల తండాకు చెందిన జర్పుల కమల్ నాయక్ను రిమాండ్కు తరలించినట్లు తెలిపారు.

## ధర్మసాగర్ టిడిపి మండల అధ్యక్షులుగా మేకల రమేష్ యాదవ్, కార్యదర్శిగా కొట్టే దామోదర్



మండల అధ్యక్షులుగా మేకల రమేష్ యాదవ్,



కార్యదర్శి కొట్టే దామోదర్

**ధర్మసాగర్/జూలై15 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం టిడిపి మండల అధ్యక్షులుగా మేకల రమేష్ యాదవ్, కార్యదర్శిగా కొట్టే దామోదర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గ ఇంచార్జ్ పుట్ట రజనీకాంత్, ముంజ వెంకట్రాజం మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూతెలంగాణ తెలుగుదేశం పార్టీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ధర్మసాగర్ మండల్ అధ్యక్ష లుగా మేకల రమేష్ యాదవ్ ప్రధాన కార్యదర్శిగా కొట్టే దామోదర్ ఏకగ్రీవంగా రెండవసారి సారీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని టిడిపి పార్టీని ధర్మసాగర్ మండలంలో కొత్త ఉత్సాహం ఉత్సాహంతో పార్టీని బలోపేతం చేయాలని కోరారు.

ఈ సందర్భంగా మేకల రమేష్ యాదవ్ గారు మాట్లాడుతూ,ఈ పదవికి నన్ను ఎంపిక చేసిన పార్టీ నాయకత్వానికి, అలాగే నా ఎన్నికకు సహకరించిన స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ పుట్ట రజనీకాంత్,ముంజ వెంకట్రాజ్యం గౌడ్ వాళ్లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తాను,అని తెలిపారు.నూతన అధ్యక్ష కార్యదర్శులు శు భాకాంక్షలు తెలిపారు. అలాగే మండల, జిల్లా స్థాయి నాయకులు, యువజన విభాగం, మహిళా విభాగం సభ్యులు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

# బిఆర్ఎస్ నూతన మండల కమిటీ ఎన్నిక

### మండల అధ్యక్షులుగా బాల్నె వెంకన్న గౌడ్

### మండలవర్కింగ్ ప్రెసిడెంట్స్ గా అనుముల కుమారస్వామి, కొండవీటి ప్రదీప్ కుమార్, అమ్మ రాజేష్





**చెన్నారావుపేట/జూలై15(జర్నలిస్ట్ వార్త):** బిఆర్ఎస్ నూతన మండల కమిటీని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మంగళవారం ప్రకటించారు. బిఆర్ఎస్ మండల అధ్యక్షులుగా రెండవసారి అమీనాబాద్ గ్రామానికి చెందిన బాల్నె వెంకన్న గౌడ్, మండలవర్కింగ్ ప్రెసిడెంట్స్ గా ఖాదర్ పేట మాజీ సర్పంచ్ అనుముల కుమారస్వామి, తిమ్మరాయిని పహాడ్ గ్రామానికి చెందిన కొండవీటి ప్రదీప్ కుమార్, అమీనాబాద్ గ్రామానికి చెందిన అమ్మ రాజేష్,మండల అధికార ప్రతినిధిగా చెన్నారావుపేట గ్రామానికి చెందిన కంది కృష్ణ చైతన్య రెడ్డి,ప్రధాన కార్యదర్శులుగా పాపయ్యపేట గ్రామానికి చెందిన భూక్య రవీందర్ నాయక్, లింగగిరి గ్రామానికి చెందిన మాదారపు శ్రీనివాస్,ఉపాధ్యక్షులుగా చెన్నారావుపేట గ్రామానికి చెందిన కుసుమ నరేందర్, ఉప్పరపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి చెరుకుపల్లి విజేందర్ రెడ్డి, 16 చింతల తండా గ్రామానికి చెందిన బానోతు గణేష్, లింగాపురం గ్రామానికి చెందిన నమిండ్ల సురేష్, కార్యదర్శిగా చెన్నారావుపేట నంబర్ వన్ కాలనీకి చెందిన సాదు నర్సింగరావు,ప్రచార కార్యదర్శిగా అక్కల్ చెడ గ్రామానికి చెందిన భూక్య కిషన్, సహాయ కార్యదర్శిగా కోనాపురం గ్రామానికి చెందిన బానాపురం రాజులను నియమించినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ బాధ్యులకు పెద్ది సుదర్శన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మా పై నమ్మకంతో పదవులు అప్పగించినందుకు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి నూతన మండల కమిటీ బాధ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# వర్షం సమృద్ధిగా కురవాలని రామాలయంలో వరుణ దేవుని పూజా

### గణపురం రైతులు గ్రామోత్సవంగా కప్పతల్లి ఆట





**గణపురం/జూలై15(జర్నలిస్ట్ వార్త):** గణపురం మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం ఆలయ అర్చకులు ముసునూరి నరేష్ ఉదయం 6:00 గంటలకు వర్షాలు సమృద్ధిగా పడాలని వరుణ దేవునిపూజాకార్యక్రమంనిర్వహించారు. అనంతరం వర్షాలు బాగా కురవాలని సమృద్ధిగా పంటలు పండాలని గణపురం గ్రామ రైతులు కప్పతల్లి ఆటను యువకులతో కలిసి గణపురం పురవీధులలో శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామిని డప్పు సప్పులతో, బింద నిండా నీరుతో వరుణదేవుని పూజిస్తూ వర్షాలు బాగా కురవాలని గణపురం పెద్దలు కప్పతల్లి ఆటను గ్రామోత్సవంగా గణపురం పురవీధులలో ఊరేగింపుగా మొదట గ్రామ దేవతలు భూలక్ష్మి అమ్మవారికి అభిషేకం నిర్వహించి, తదుపరి పోచమ్మ తల్లికిఅభిషేకంనిర్వహించి కప్పతల్లి ఆటగణపసముద్రం చెరువుకట్టపై గలదక్షిణ ముఖ ఆంజనేయస్వామి దేవాలయం వరకు కొనసాగించి మరల రామాలయంవరకుకప్పతల్లి ఆటను కొనసాగించారు. ఈ పూజాకార్యక్రమంలో శ్రీరామ భక్తులు, ప్రజలు, రైతులు, మహిళలు సంతోషంగా పాల్గొని వర్షాలు సమృద్ధిగా పడిపంటదిగుబడి సమృద్ధిగా ఉండాలని వరుణ దేవునికి పూజలు నిర్వహించారు.

# జానకిపురం లో వైద్య శిబిరాన్ని సద్వినియోగించుకోవాలి

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఏ అయ్యప్ప




**ధర్మసాగర్/జూలై15(జర్నలిస్ట్ వార్త):** జానకపురంలో వైద్య శిబిరాన్ని సద్విని చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఏ అయ్యప్ప అన్నారు. మంగళవారం ధర్మసాగర్ మండలంలోని జానకిపురం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ అప్పయ్య గ్రామంలో జరుగుతున్నటువంటి డ్రైడే కార్యక్రమం ,ఫీవర్ సర్వే ,హెల్త్ క్యాంపులను పరిశీలించారు. . అనంతరం ఆయన మాట్లాడుతూ ఎవరైనా జ్వరంతో బాధపడుతున్నట్లయితే హెల్త్ క్యాంప్ వద్దకు వచ్చి చికిత్స చేయించుకోవాలని ప్రతి మంగళ, శుక్రవారం రోజు డ్రై డే కార్యక్రమం (పొడి దినం) ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండే పాత్రలు నట్లయితే ఖాళీ చేసి ఆరబెట్టి వాడుకోవాలని నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ,ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురి కావద్దని సూచించారు. గ్రామంలో వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది నాలుగు బృందాలుగా ఏర్పడి 618 నీటి కంటైనర్లను పరిశీలించగా అందులో 291 లో లార్వా కనిపించగా వాటిని ఖాళీ చేసి క్రిమి సంహారక మందుతో లార్వాను నిర్మూలించడం జరిగిందన్నారు. అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ డి మదన్మోహన్ రావు మాట్లాడుతూ జ్వరంతో బాధపడుతున్నటువంటి వారికి మలేరియా, డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు హెల్త్ క్యాంప్లో చేస్తున్నారని ప్రజలు ఆందోళన చెందవద్దని మరియు దోమల పుట్టకుండా కుట్టకుండా ఎలా జాగ్రత్తలుతీసుకోవాలో ,గ్రామంలోని పలు వీధుల్లో ప్రజలకు దోమల వలన నీటి వలన వచ్చే వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు . హెల్త్ క్యాంపులో 72 మంది ప్రజలను పరీక్షించడం జరిగినది. మలేరియా: 11 పరీక్షలు నిర్వహించగా అన్ని పరీక్షలు నెగిటివ్,డెంగ్యూ ఆర్డి టీ పరీక్షలు: 11 నిర్వహించగా అన్ని పరీక్షలు నెగిటివ్ గా వచ్చాయని యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్ ఆపరేషన్, హౌస్ టు హౌస్ ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీమతి గంగాభవాని ఎంపీడీవో శ్రీ అనిల్ ,ధర్మసాగర్ వైద్యాధికారి డాక్టర్ బి అరుణ ,పల్లెదావకాన వైద్య అధికారి డాక్టర్ భారతి, సబ్ యూనిట్ ఆఫీసర్లు ఖాదర్ అబ్బాస్ ,పరంజ్యోతి, హెల్త్ సూపర్వైజర్లు రమేష్, రామ్మోహన్ రావు, హెల్త్ అసిస్టెంట్లు కరుణాకర్ ,సుమన్, శిరీష్ రెడ్డి, సిస్టర్లు , ల్యాబ్ టెక్నీషియన్ రాజేశ్వరి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



# సత్తుపల్లి నియోజకవర్గంలో పరవళ్ళు తొక్కుతున్న గోదావరి నీళ్ల

**సత్తుపల్లి/జూలై15(జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లి నియోజకవర్గంలో గోదావరి నీళ్ల పరవళ్ళు తొక్కుతున్నాయి. రెండు రోజుల క్రితం సీతారామ ప్రాజెక్టు ద్వారా సత్తుపల్లి నియోజకవర్గానికి గోదావరి జలాలను విడుదల చేశారు. దీంతో కల్లూరు, వేంసూర్ మండలాలకు గోదావరి జలాలు ప్రవహిస్తున్నాయి. దీంతో ఈ ప్రాంత రైతులు మోము లో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రాంతాలు కి నీటి ఎద్దడి తీరినట్లే అని సంతోషం గా వ్యవసాయ పనులు ముమ్మరం చేశారు. కరువు ప్రాంతాలు అయిన మా ఏరియా లకు నీటి కొరత తీరింది అంటూ అంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతాలలో చెరువులు, కుంటలు లలో నిండాయి అంటూ హర్షంవ్యక్తంచేశారు.

# డెంటిస్ట్ ప్రత్యూష ఆత్మహత్య కేసు భర్తతో పాటు కుటుంబ సభ్యుల అరెస్ట్



హన్మకొండ,**జులై15(జర్నలిస్ట్ వార్త)** డెంటిస్ట్ ప్రత్యూష ఆత్మహత్య కేసులో ఆమె భర్త సృజన్ను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులైన ప్రత్యూష భర్త సృజన్, ఆయన తల్లిదండ్రులు, సృజన్తో వివాహేతర సంబంధం పెట్టుకున్న సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్సర్ను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఈ కేసు వివరాలను ఏసీపీ పి.ప్రశాంత్రెడ్డి మీడియాకు వెల్లడించారు. సోషల్మీడియా ఇన్ఫ్లూయెన్సర్తో వివాహేతర సంబంధాన్ని వదిలిపెట్టబోనని భర్త తేల్చిచెప్పడంతోనే డెంటిస్ట్ ప్రత్యూష ఆత్మహత్యకు పాల్పడినట్లు- కాజీపేట పోలీసులు తెలిపారు. ప్రత్యూష-సృజన్ దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. వీరి కుటుంబం హసన్పర్తిలోని కాకతీయ వింటేజ్ విల్లాస్లో స్థిరపడింది. కొన్నాళ్ల క్రితం ఓ ప్రైవేటు- ఆస్పత్రి పబ్లిసిటీ- కోసం యాజమాన్యం సోషల్మీడియా ఇన్ఫ్లూయెన్సర్ను పిలిపించారు. ఆమెతో సృజన్కు ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. అప్పటి నుంచి కుటుంబాన్ని పట్టించుకోని సృజన్.. భార్యను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. ఇన్ఫ్లూయెన్సర్ను వదిలిపెట్టలేనని తేల్చి చెప్పాడు. భర్తతోపాటు అత్తమామలు, ఇన్ఫ్లూయెన్సర్ వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ క్రమంలోనే ఈనెల 13న సృజన్, ప్రత్యూష మధ్య గొడవ జరిగింది. వివాహేతర సంబంధాన్ని వదిలేయాలని ఎంత చెప్పినా భర్త తన మాట వినకపోవడంతో మనస్తాపానికి గురైన ప్రత్యూష.. అదే రోజు సాయంత్రం గదిలో ఫ్యాన్కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. భార్య ఎంతసేపటికీ గది నుంచి బయటకు రాకపోవడంతో సృజన్ కిటికీ నుంచి చూడగా.. ప్రత్యూష ఉరివేసుకోవడం కనిపించింది. వెంటనే తన స్నేహితులకు సమాచారం అందించిన సృజన్.. వారి సాయంతో ప్రత్యూషను ఓ ప్రైవేటు- ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధరించారు. ఈ ఘటనపై హసన్పర్తి పోలీస్ స్టేషన్లో ప్రత్యూష తల్లి సోమవారం ఫిర్యాదు చేశారు. ప్రత్యూష మరణించడంతో భర్త సృజన్, అత్తమామలు, ఇన్ఫ్లూయెన్సర్ పోలీసుల కంట కనిపించకుండా తప్పించుకొని తిరిగారు. కాకతీయ వింటేజ్ విల్లాస్ వద్ద పోలీసులు గస్తీ కాస్తున్న విషయం తెలియక మంగళవారం ఉదయం ఆ నలుగురు కారులో అక్కడికి చేరుకున్నారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని న్యాయమూర్తి వద్ద ప్రవేశపెట్టి రిమాండ్కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఆమె ఒంటిపై గాయాలు ఉన్నాయని, వారే హత్య చేశారని ప్రత్యూష తల్లిదండ్రులు ఆరోపించారు.

# ఫ్యూచర్ సిటీ గేమ్ ఛేంజర్

### డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క




హైదరాబాద్,**జులై15(జర్నలిస్ట్ వార్త)** ఫ్యూచర్ సిటీ తెలంగాణ అభివృద్ధికి గేమ్ ఛేంజర్ అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. మూసీ పునర్జీవనం, రీజనల్ రింగ్ రోడ్డు పూర్తయితే హైదరాబాద్ అభివృద్ధి ఊహకు అందదని ఆయన అన్నారు. తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సమావేశంలో డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఇది ప్రజల ప్రభుత్వం పారిశ్రామికవేత్తలు ఎప్పుడైనా సీఎం రేవంత్ రెడ్డి, యావత్ కేబినెట్, ఉన్నతాధికారులను సంప్రదించవచ్చని అన్నారు. మా ప్రభుత్వ ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయని, పెండింగ్ పవర్ బిల్లుల వన్ టైం సెటిల్మెంట్ గురించి ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. ప్రభుత్వం పరిశ్రమలు పౌర సమాజం అంతా కలిసి పని చేద్దాం.. హైదరాబాదులో సృష్టించే సంపదను రాష్ట్రంలోని ప్రతి ఇంటికి తీసుకెళ్దామని, సంపద సృష్టించడం ఒక సాధన మాత్రమే మన ప్రజల గౌరవాన్ని పెంపొందించడం వారి ఆశయాలను నెరవేర్చడం ప్రభుత్వ లక్ష్యమన్నారు భట్టి విక్రమార్క. తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కీ వందేళ్ల పైగా అనుభవం ఉందని, హైదరాబాద్ నగరం ఒక వర్తక నగరం నుంచి ప్రపంచ స్థాయి నగరంగా ఎదిగే వరకు ప్రతి దశలోనూ ముందు నడిచిందన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు

### ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు సిట్ పిలుపు

హైదరాబాద్,**జులై15(జర్నలిస్ట్ వార్త)** ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించిన కేసులో విచారణకు హాజరు కావాలని ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్నను సిట్ అధికారులు మంగళవారం నోటీసులు జారీ చేశారు. 17వ తేదీన జూబ్లీహిల్స్లోని సిట్ కార్యాలయానికి రావాలని ఆయనకు ఆ నోటీసుల్లో సూచించారు. మరో వైపు ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ప్రభాకర్ రావును మంగళవారం సిట్ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. అందులోభాగంగా దాదాపు 8 .30 గంటల పాటు- ప్రభాకర్ రావును సిట్ అధికారులు ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయనకు పలు ప్రశ్నలు సంధించి.. పలు కీలక విషయాలు రాబట్టినట్లు- తెలుస్తుంది.

# మెదక్ జిల్లా కాంగ్రెస్ నేత హత్య

### అనుమానాస్పద మృతిపై పోలీసుల దర్యాప్తు

మెదక్,**జులై15(జర్నలిస్ట్ వార్త)** మెదక్ జిల్లా కొల్చారం మండలం పైతరకు చెందిన కాంగ్రెస్ యువనేత మారెల్లి అనిల్ (35) అనుమానాస్పద రీతిలో మృతిచెందాడు. అతని కుడి భుజం నుంచి రెండు బుల్లెట్లు- దూసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అయితే ప్రత్యర్థులు ఆయనను కాల్చి చంపినట్లు తెలుస్తోంది. రియల్ వ్యవహారంలో ఈ ఘటనజరిగిందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. శవపరీక్ష కోసం అనిల్ మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న అనిల్ తొలుత రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు- ప్రకటించారు. పెట్రోలు బంక్ నిర్వహిస్తున్న అనిల్.. సోమవారం రాత్రి మెదక్ నుంచి స్వగ్రామానికి కారులో బయల్దేరాడు. ఇదే మండలం చిన్నఘనపూర్ విద్యుత్తు ఉపకేంద్రం వద్ద కారు అదుపు తప్పి కల్వర్టుకు వాహనం ఢీకొట్టింది. దీంతో కారు పొలాల్లోకి దూసుకెళ్లింది. అనిల్కు తీవ్రగాయాలు కావడంతో అక్కడున్న వారు గమనించి మెదక్లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. అయితే పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించగా బుల్లెట్ల విషయం వెలుగులోకి వచ్చింది. ప్రత్యర్థులు కారు ఆపి తుపాకీతో కాల్చినట్లు ప్రచారం సాగుతోంది.